


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేయాలి

» సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

రంగారెడ్డి అర్బన్, జూలై 5 : మోదీ ప్రభుత్వం సింగరేణి సంస్థకు సంబంధించిన బొగ్గు గనుల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో శుక్రవారం వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థను కార్పొరేట్ సంస్థలకు అమ్మే కుట్ర చేయడం దుర్మార్గమని విమర్శించారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌లను సింగరేణి సంస్థకే కేటాయించే వరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, ముత్యాల యాదిరెడ్డి, కావలి నర్సింహ, ఓరుగంటి యాదయ్య, కె. రామస్వామి, టి. రామకృష్ణ, సీపీఎం నాయకులు నర్సింహులు, అల్లంపల్లి బాలరాజు, కిషన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, రామకృష్ణారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.




మీకంటే మేమేం తక్కువ కాదన్నట్లు కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే లేకుండా బీఆర్ఎస్ అందరినీ తమ పార్టీలో చేర్చుకుంది. ఇప్పుడు ఇదే పద్ధతిని కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తోంది. ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అందరినీ తమ పార్టీలో చేర్చుకునేందుకు తీవ్రంగా యత్నిస్తోంది. ఇప్పటికే చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య కారు దిగి హస్తం గూటికి చేరారు. ఆయన బాటలోనే మరికొందరున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. దీంతో వీరంతా కాంగ్రెస్‌కు జై కొడతారన్న ప్రచారం సాగుతోంది.

మరో ముగ్గురు జంప్!

» గ్రేటర్ సమావేశానికి పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డుమ్మా
» చేరికలను ముమ్మరం చేసిన అధికార పార్టీ
» రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్న కాంగ్రెస్

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు?

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

అధికార కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్‌ను ముమ్మరం చేసింది. చేరికల విషయంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు వరుసగా షాక్‌ల మీద షాక్‌లు ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ త్వరలో మరో షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. అనూహ్యంగా గురువారం అర్ధరాత్రి ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను కాంగ్రెస్ తన గూటికి తెచ్చుకున్న విషయం తెలిసిందే. అయితే ఈసారి అధికార పార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై గురిపెట్టినట్లు తెలిసింది. త్వరలో ఆరు లేదా ఎనిమిది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కూడా ఉన్నట్లు తెలిసింది. తాజా పరిణామాలు ఈ అనుమానాలకు బలం చేకూర్చే విధంగా ఉన్నాయి. ఇటీవలే చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య అనూహ్యంగా కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు విధేయుతగా ఉండే యాదయ్య గుట్టుచప్పుడు కాకుండా ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో గులాబీ నేతలు షాక్‌కు గురయ్యారు. తాజాగా గురువారం అర్ధరాత్రి ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరి చేరికలు కూడా చివరి క్షణం వరకు గోప్యంగానే ఉంచడం గమనార్హం. అతి త్వరలోనే మరికొందరు ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ప్రచారానికి బలం చేకూరుస్తూ బీఆర్ఎస్‌లో కొత్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం తెలంగాణ భవన్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. 6వ తేదీన జరిగే జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధారం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి హాజరు కాలేదు. దీంతో చేరికల ప్రచారానికి మరింత బలం చేకూరుతోంది.

కాంగ్రెస్ రిటర్న్ గిఫ్ట్

గతంలో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలందరినీ బీఆర్ఎస్ తమ పార్టీలో చేర్చుకున్న విషయం తెలిసిందే. దీంతో కాంగ్రెస్‌కు ఒక్క ఎమ్మెల్యే కూడా మిగలలేదు. ఇపుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరినీ తమవైపు తిప్పుకోవాలని భావిస్తోంది. బీఆర్ఎస్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేందుకు విడతల వారీగా ఎమ్మెల్యేలను చేర్చుకుంటోంది. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా రంగంలో దిగి చేరికలపై కొందరు ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నట్లు తెలిసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండడంతో పార్టీని బలోపేతం చేసేందుకు, ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ ద్వారాలు తెరిచింది. ఇందుకు పార్టీ అధినాయకత్వం కూడా ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి చేరికలపై దృష్టి సారించారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డితో టచ్‌లో ఉన్నారు. ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు వేర్వేరు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఏకాంత చర్చలు జరిపారు. ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే, ఈ చేరిక విషయాలు చివరవరకు కాంగ్రెస్ గోప్యంగానే ఉంచుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు శివారు ప్రాంతాలకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. అయితే ఇందులో ఒకరు మరికొందరు చేరిన తరువాత చేరతానని.. ముందు చేరడం తనకు ఇష్టం లేదని చెప్పినట్లు సమాచారం. అలాగే శివార్లలో మరో ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరేందుకు ముందు నుంచి ఆసక్తిగా ఉన్నారు. అయితే ఇక్కడ గత ఎన్నికల్లో ఓటమి చెందిన నేత ఆయనను ఢిల్లీ స్థాయిలో అడ్డుకునే యత్నం చేస్తున్నారు.

దశాబ్దం తర్వాత సొంత గూటికి

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఈ స్థానం నుంచి వరుసగా మూడు సార్లు విజయం సాధించారు. దాదాపు దశాబ్దకాలం తరువాత తిరిగి ఆయన సొంత గూటికి చేరారు. కాంగ్రెస్‌లో అనేక పదవులు అనుభవించిన యాదయ్య 2014లో కాంగ్రెస్ తరుపున పోటీచేసి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. తరువాత ఆయన బీఆర్ఎస్‌లో చేరి 2019, 2023లో ఆ పార్టీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు. మళ్లీ పదేళ్ల కాలం తరువాత యాదయ్య తిరిగి కాంగ్రెస్ గూటికి చేరడం గమనార్హం. యాదయ్య తన చేరిక విషయాన్ని చివరి వరకు గోప్యంగానే ఉంచారు. యాదయ్య పార్టీ మార్పుపై కొంతకాలంగా ఊహాగానాలు వెలువడుతున్నా ఆయన అదేమీ లేదంటూ ఖండిస్తూ వచ్చారు. ఇటీవల వికారాబాద్‌లో ఆ రోజు జిల్లా పరిషత్ భవన సముదాయం ప్రారంభోత్సవ సభలో యాదయ్య మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో నిధుల విషయంలో కూడా స్వల్పంగా ఘర్షణ పడ్డారు. దీంతో యాదయ్య పార్టీ మార్పుపై ఎవరికీ అనుమానం రాలేదు. ఇటీవల ఆయన మాజీ మంత్రి చంద్రశేఖర్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ఢిల్లీ వెళ్లారు. ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకునే వరకు చేరిక విషయం గోప్యంగానే ఉంచారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూలై 5 : నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేంత వరకు బీజేవైఎం పోరాటం ఆగదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేక లక్షలాది మంది యువకులు ఇబ్బందులకు గురవుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లాలో అక్రమంగా టీచర్ల బదిలీలు నిలిపివేయాలని, డబ్బులు తీసుకొని బదిలీలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్న డీఈవోను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, నోముల దయానందగౌడ్, బోస్ పల్లి ప్రతాప్, కె. భగీరథ, పగడాల శ్రీశైలం, పాండు, గోగిరెడ్డి లచ్చిరెడ్డి, ప్యాట అశోక్, అశోక్, బోధ యాదగిరిరెడ్డి, బతుకు శ్రీనివాస్, భస్వ రఘుగౌడ్, మునావత్ దేవేందర్, రణధీర్‌గౌడ్, విశ్వనాథ్‌గౌడ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మా పిల్లలు సర్కారు బడికే..

» ప్రైవేట్ స్కూళ్లలో చేర్పించబోమని గ్రామస్థుల నిర్ణయం
» విద్యార్థులను తీసుకెళ్లేందుకు వచ్చిన బస్సు అడ్డగింత
» కొందుర్గు మండలం చెర్కుపల్లిలో ఘటన



రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులు

కొందుర్గు, జూలై 5 : తమ పిల్లలను సర్కారు బడికే పంపిస్తామని, ప్రైవేటు బడుల్లో చదివించబోమని గ్రామస్తులు తేల్చి చెప్పారు. తమ ఊరికి చెందిన పిల్లలను తీసుకెళ్లేందుకు వచ్చిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సును అడ్డుకున్నారు. ఈ సంఘటన కొందుర్గు మండలం చెర్కుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొందుర్గు మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలకు.. చెర్కుపల్లి గ్రామం నుంచి అనేక మంది విద్యార్థులు వెళుతుంటారు. వారంతా తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువు పూర్తిచేసి 6వ తరగతి చదివేందుకు మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళుతుంటారు. ఈక్రమంలో చెర్కుపల్లి ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదివిన విద్యార్థులను తమ స్కూళ్లో చేర్పించుకునేందుకు శుక్రవారం ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం బస్సును గ్రామంలోకి పంపింది. దాంతో చెర్కుపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివారెడ్డి, గ్రామస్తులు, విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి బస్సును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రైవేటు పాఠశాల నిర్వాహకులతో మాట్లాడుతూ చెర్కుపల్లి ప్రాథమిక పాఠశాలలో తమ గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రాథమిక విద్య పూర్తిచేసిన అనంతరం గురుకుల(నవోదయ) పాఠశాలల ప్రవేశ పరీక్ష రాసి సీట్లు సాధిస్తున్నారని, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు అందులో సీట్లు రావడం లేదని, తమ గ్రామంలోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు మాత్రమే పంపిస్తామని తెలిపారు. గ్రామానికి చెందిన ఏ ఒక్క విద్యార్థి కూడా ప్రైవేట్ పాఠశాలలకు రారని తెగేసి చెప్పారు. దాంతో ప్రైవేటు స్కూల్ నిర్వాహకులు గ్రామస్తులతో మాట్లాడుతూ.. శనివారం నుంచి గ్రామంలోకి ప్రాథమిక పాఠశాలలో చేర్చుకునే పిల్లల కొరకు బస్సు రాదని చెప్పడంతో ధర్నా విరమించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తులు కొత్తగా ఐదుగురిని 5వ తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు యాదయ్య, ప్రేమ్‌కుమార్, రామస్వామి, జీవన్, అంజనేయులు, బాలమణి, నర్సమ్మ, మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల భారీ వర్షాలు.. రైతులకు ఉపశమనం



వర్షానికి వీధుల్లో నిలిచిన నీళ్లు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, జూలై 5 :ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొద్ది రోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఆందోళనతో ఉన్న రైతాంగం శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. ముఖ్యంగా మెట్ట ప్రాంత రైతులు పూర్తిస్థాయిలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కడపటి వార్తలందే సమయానికి వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాపోల్‌లో అత్యధికంగా 41మి.మీ వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లిలో 40 మి.మీ వర్షం కురిసింది. కుల్కచర్లలో 32.3 మి.మీ, మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 28మి.మీ, కేశంపేటలో 27మి.మీ, మేడ్చల్ జిల్లా దుండిగల్‌లో 25మి.మీ, సరూర్‌నగర్‌లో 24మి.మీ, శేరిలింగంపల్లిలో 22మి.మీ, రాజేంద్రనగర్, యాచారం, మంచాలలో 20మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఇంకా అర్ధ రాత్రి కూడా పలుచోట్ల వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

11 ఏళ్ల కల నేరవేరింది

» టీ-20 ప్రపంచ కప్ గెలవడం దేశానికి గర్వకారణం
» భారత క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్
» శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘనంగా స్వాగతం పలికిన అభిమానులు



శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న క్రికెటర్ సిరాజ్

శంషాబాద్ రూరల్, జూలై 5 : భారత క్రికెట్ అభిమానులు 11 ఏళ్లుగా ఎదురు చూస్తున్న కల నేరవేరిందని, క్రికెట్ టీ-20 ప్రపంచ విజేతగా నిలవడంతో దేశం గర్విస్తోందని భారత క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ అన్నారు. క్రికెట్ టీ-20 ప్రపంచ కప్ గెలిచిన అనంతరం శుక్రవారం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న సిరాజ్‌కు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అభిమానులు, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. క్రికెట్ టీ-20 ప్రపంచ కప్ గెలిచేందుకు భారతీయులు 11 ఏళ్లుగా ఎదురు చూశారని, నేడు ఆ కల నేరవేరిందని అన్నారు. భారత క్రికెట్ జట్టు కప్పు గెలవడం చాలా సంతోషంగా ఉందని, హైదరాబాద్‌కు గర్వకారణమని అన్నారు. అభిమానులకు ఇది మరిచిపోని రోజు.. తాను క్రికెట్ టీమ్ కోసం చాలా కష్టపడుతున్నానని, ముమ్ముందు మరింత కష్టపడి ఉత్తమ ప్రదర్శన చేసి మరిన్ని కప్‌లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాగా, క్రికెటర్ మహ్మద్ సిరాజ్ వస్తున్నారనే సమాచారంతో.. అభిమానులు భారీగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అభిమాన క్రికెటర్ జై.. భారత్ మాతాకీ జై.. అంటూ నినాదాలు చేశారు. సిరాజ్ రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో అభిమానులతో సందడి నెలకొంది. అనంతరం ఆయన ప్రత్యేక కాన్వాయ్‌లో నగరానికి బయలుదేరి వెళ్లారు.



సిరాజ్‌కు ఘన స్వాగతం పలుకుతున్న అభిమానులు

వనమహోత్సవంలో లక్ష్యాన్ని పూర్తి చేయాలి

» జిల్లా కలెక్టర్ శశాంక


రంగారెడ్డి అర్బన్, జూలై 5 : వనమహోత్సవం కింద ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమంపై అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపాలిటీ కమిషనర్లు, ఎంపీడీఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024లో 82.5 లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించామని తెలిపారు. వర్షాలు కురుస్తున్నాయని, భూమి పదునుగా ఉన్న సమయంలో మొక్కలు నాటాలని, నిర్ణీత గడువు లోపు లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. లక్ష్య సాధన కోసం అనువైన స్థలాలను గుర్తిస్తూ, మొక్కలు నాటడంతో పాటు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలతో పాటు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు, కాలువ కట్టలపైనా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలలో ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కలను అందజేయాలని సూచించారు. రానున్న మూడు వారాల్లోపు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వంద శాతం మొక్కలు నాటించాలని గడువు విధించారు. వనమహోత్సవ కార్యక్రమం ప్రగతి గురించి రోజు వారీగా నివేదికలు సమర్పించడంతో పాటు, వివరాలను వెంటవెంటనే ఆన్‌లైన్లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణతో ముడిపడిన వనమహోత్సవ కార్యక్రమానికి ప్రతీ ఒక్కరు ప్రాధాన్యతనిస్తూ లక్ష్యాల సాధనకై పకడ్బందీ ప్రణాళికలు రూపొందించుకుని తదనుగుణంగా అంకిత భావంతో కృషి చేయాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా కార్యక్రమాలను రూపొందించిన సమయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని, గ్రామీణ ప్రాంతాలలో మండల ప్రత్యేక అధికారులను భాగస్వాములు చేయాలని కలెక్టర్ శశాంక సూచించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టడంతో పాటు, అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, విషజ్వరాలు, మెదడువాపు వంటి వాటిని అరికట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ సంసిద్ధంగా ఉండాలని, వ్యాధుల పట్ల ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపల్ పట్టణాలు, గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, ఎక్కడైనా నీరు నిల్వ ఉండే చోట ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. దోమలు రాకుండా ఫాగింగ్ చేయాలని, ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ప్రతీరోజు జ్వరాలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జ్వరం కేసులు వచ్చినట్లయితే వాటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించి తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే డ్రైడే నిర్వహించాలన్నారు. ఆర్బీఎస్‌కే బృందాలు జిల్లాలోని విద్యాసంస్థలను సందర్శించి పరిస్థితిని గమనించాలన్నారు. పాఠశాలలో సైన్స్ టీచర్ల ద్వారా విద్యార్థులకు వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులపై పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారికి సూచించారు. గ్రామాలలో ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ ప్రత్యేకాధికారుల ద్వారా తగు చర్యలు చేపట్టాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. మున్సిపాలిటీలలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో సీజనల్ వ్యాధులను అరికట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జడ్పీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్

జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ శశాంక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ పాలకవర్గం పదవీకాలం పూర్తి కావడంతో కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ జిల్లా పరిషత్‌కు చేరుకొని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఇతర అధికారులు కలెక్టర్ శశాంకకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి


వికారాబాద్: ధర్నా చేసేందుకు వచ్చిన నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

వికారాబాద్, జూలై 5: అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పిన విధంగా దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు. వికారాబాద్ కలెక్టరేట్‌ను శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడు నెలలు అవుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు వెలగబెట్టిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చినహామీలను అమలు చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. ధర్నా నిర్వహించేందుకు వచ్చిన నాయకులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారు కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు చరణ్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, దివ్యాంగ సంఘాల నాయకులు పోతురాజు సుధీర్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన పెన్షన్‌ను అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు అవుతున్నా ఇంత వరకు పింఛన్లు అందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ఒక్కటైన ఏపీలో ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు గడవకముందే అక్కడ పెంచిన పెన్షన్లను అమలు చేస్తున్నారని, తెలంగాణలో ఎందుకు అమలు కావడం లేదని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా పెంచిన పెన్షన్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు వినయ్, మంగమ్మ, గంగపుత్ర శ్రీను, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.


మల్కాజిగిరి: కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

రోడ్లను కమ్మేసిన ముళ్లపొదలు

● జనగాం, మంబాపూర్, జీవన్గిలో వాహనదారులకు ఇబ్బందులు


పెద్దేముల్: జనగాంలో దారి కనిపించని విధంగా పెరిగిన ముళ్ల పొదలు

పెద్దేముల్, జూలై 5: రోడ్డుపైన ముళ్లపొదలు కమ్మేసి ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా బస్సు వస్తే పక్కనుంచి వెళ్లలేని పరిస్థితి ఎదురైంది. ముళ్లపొదలు తొలగించి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని జనగాం గ్రామానికి నిత్యం వయా మంబాపూర్ మీదుగా ఆర్టీసీ బస్సు నడుస్తోంది. అంతే కాకుండా ఈరోడ్డుపైన లారీలు కూడా అధికంగానే తిరుగుతుంటాయి. మంబాపూర్ నుంచి జనగాం గ్రామానికి వెళ్లే రోడ్డుపైన చాలాచోట్ల రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు రోడ్డుపైకి వచ్చాయి. ఒకవాహనం వెళ్తుంటే మరో వాహనం దాటడం కష్టంగా మారుతోంది. ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇవ్వబోయి బైక్‌పై వెళ్తున్న వారికి ముళ్లల గుచ్చుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదేవిధంగా ఎదురుగా వచ్చే వాహనం కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి వెంటనే ముళ్ల పొదలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బషీరాబాద్: మండలంలోని జీవన్గి ప్రధాన ఆర్అండ్‌బీ మార్గంలో ఇరువైపులా ముళ్లపొదలు రోడ్డును కప్పేస్తున్నాయి. ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నప్పుడూ ఎదురుగా వచ్చే వాహనాలు కలినిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మలుపోట్ల మూలమలుపులు ఉండటంతో ఎప్పుడేం జరుగుతుందోనని వాహనదారులు భయం గుప్పిట్లో ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ముళ్ల పొదల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


మంబాపూర్ సమీపంలో రోడ్డుపైకి వచ్చిన ముళ్లపొదలు


బషీరాబాద్: జీవన్గిలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు

ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయురాలు

● ఒకే గదిలో బోధన


ఐనెల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు బోధిస్తున్న ఒకే ఉపాధ్యాయురాలు

తాండూరు రూరల్, జూలై 5: తాండూరు మండలం ఐనెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఒకేఉపాధ్యాయురాలితో కొనసాగిస్తున్నారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగుతోంది. మొత్తం 43మంది విద్యార్థులు చదువుతుండగా శుక్రవారం 34మంది విద్యార్థులు హాజరయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి బదిలీపై గోనూరు పాఠశాలకు వెళ్లారు. మరో ఉపాధ్యాయురాలు శ్వేతారాణి ఫిబ్రవరి నెల నుంచి మెటర్నిటీ సెలవుల్లో ఉన్నారు. ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా బషీరాబాద్ మండలం నవాంద్గి పాఠశాల నుంచి ఉపాధ్యాయురాలు పాపమ్మ శుక్రవారం ఐనెల్లి పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఒకే తరగతి గదిలో ఐదు తరగుతులకు బోధిస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో వెంకటయ్యను వివరణ కోరగా 30మంది విద్యార్థుల కన్నా ఎక్కువ విద్యార్థులు హాజరైతే మరో పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని ఐనెల్లి పాఠశాలకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఐనెల్లి పాఠశాలకు ప్రభుత్వం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించిందని తెలిపారు. ఇందులో ఒకరు మెటర్నిటీ సెలవుల్లో ఉండటంతో ప్రస్తుతం ఒక ఉపాధ్యాయురాలితో పాఠశాల కొనసాగుతున్నట్లు చెప్పారు.

ఒలంపియాడ్‌లో పరిగి విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

పరిగి, జూలై 5: సెమ్స్ ఒలంపియాడ్‌లో పరిగి విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. పరిగిలోని శ్రీసరస్వతిశిశుమందిర్‌లో ఐదవతరగతి చదువుతున్న ఇ.శ్రీవర్ధన్, ఎన్ అర్జున్‌లు రాష్ట్రస్థాయి ఒలంపియాడ్‌లో పరీక్షలు రాశారు. అయితే రాష్ట్రస్థాయిలో శ్రీవర్ధన్ ఐదవర్యాంకు, అర్జున్ ఆరవర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో ఇద్దరు విద్యార్థులకు నగదుతోపాటు, మెమోంటో, మెడల్స్, ధ్రువీకరణ పత్రాలను పాఠశాల హెచ్‌ఎం మల్లేశ్‌తోపాటు, ఉపాధ్యాయ బృందం సన్మానించింది.



ఒలంపియాడ్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం



శంకర్‌పల్లి చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

బస్సులు నడపాలని విద్యార్థుల నిరసన

శంకర్‌పల్లి, జూలై 5 : బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఒడి వేళల్లో బస్సులు నడపాలని టీఏఎస్ఎస్ మండల కమిటీ అధ్యక్షురాలు మానస, ఉపాధ్యక్షురాలు పావనిలు ఆవేదన వ్యక్తం చేశారు. టీఏఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం శంకర్‌పల్లి చౌరస్తాలో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్వేద, అంతప్పగూడ, సంకేపల్లి, మాసానిగూడ తదితర గ్రామాలకు బస్సులు రాకపోవడంతో శంకర్‌పల్లితో పాటు నగరానికి వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు రాకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తున్నదని వాపోయారు. ఆటోల్లో వెళితే సమయానికి కళాశాలలకు చేరేందుకు ఇబ్బందిగా ఉంటోందని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం వెంటనే ఉపకార వేతనాలను అందజేయాలని డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి నుంచి హైదరాబాద్ వరకు విద్యార్థుల(బాలురు)కు ఉచిత బస్‌పాస్‌లు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్, జూలై 4 : తెలంగాణ ప్రభుత్వ జ్యోతిరావు పూలే(సాతంరాయి-కందుకూరు) పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జంగం విరూపాక్ష తెలిపారు. కాగా, కళాశాల కందుకూరుకు మంజూరైందని, అక్కడ సరైన స్థలం లేక శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సాతంరాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ ఎంఎస్‌సీఏ అండ్ ఎంఎల్, బీఎస్సీ (బీజెడ్‌సీ), బీకాం (సీఏ), బీఏ (ఐఆర్‌ఈపీ), బీబీఏ డిగ్రీ కోర్సులు ఇంగ్లీషు మీడియంలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు స్పాట్ అడ్మిషన్స్ కొరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 10వ తేదీ లోపు కళాశాలకు నేరుగా వచ్చి అడ్మిషన్లు పొందగలరని తెలిపారు. కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత హాస్టల్, పాఠ్యపుస్తకాలు, దుస్తులు ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పూర్తి వివరాలకు 9502842482, 9491694218, 8341905950 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రాజు, తదితరులు

దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలి

» ఎన్‌పీఆర్డీ జిల్లా కార్యదర్శి జర్కోని రాజు

ఆదిబట్ల, జూలై 5 : ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని ఎన్‌పీఆర్డీ జిల్లా కార్యదర్శి జర్కోని రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. జర్కోని రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2024 జనవరి నుంచి పెంచిన కొత్త పింఛన్లు అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీ మాత్రం అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హామీ అమలు కోసం రాష్ట్రంలో సుమారు 45 లక్షల మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని అన్నారు. 2011 ప్రకారం కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లలో తమ వాటాకింది కేవలం రూ.300 మాత్రమే ఇస్తుందని పెరిగిన ధరల సూచీకి ఇది ఏమాత్రం సరిపోదన్నారు. కేంద్ర ప్రభుత్వం వాటాను రూ.300 నుంచి రూ.3000లకు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ నాయకులు మహేష్ గౌడ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ జయంత్యుత్సవాలు

ఆదిబట్ల, జూలై 5 : ఈనెల 8న ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉక్కుల అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీల సేవలను గుర్తించి, వారికి కమ్యూనిటీ పారా మెడికల్ శిక్షణ ఇప్పించారని, వారి కుటుంబాలకు భరోసా ఇచ్చారని అన్నారు. ఈనెల ఈనెల 8న రాష్ట్రవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కమ్యూనిటీ పారామెడిక్ వైద్యులకు పిలుపునిచ్చారు. ఆర్ఎంపీ, పీఎంపీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్లలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు పేదలకు నిత్యవసర సరుకులు, పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అనాథలు, రోగులకు పండ్లు పంపిణీ చేసి మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ ఉక్కుల అశోక్ పేర్కొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



చౌదరిగూడ, జూలై 5: మండల పరిధిలోని చేగిరెడ్డి ఘణపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. గ్రామానికి చెందిన పద్మకు శుక్రవారం సాయంత్రం పురిటి నొప్పులు రావడంతో అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది గ్రామానికి చేరుకొని గర్భిణీని కొందుర్గు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువవడంతో ఈఎంటీ దాసరి సాయికృష్ణ, పైలెట్ యాదయ్యతో కలిసి ప్రసవం చేశారు. ఆ మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని 108 సిబ్బంది తెలిపారు. చికిత్స నిమిత్తం కొందుర్గు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు చెప్పారు.

చటాన్‌పల్లి రైల్వే గేట్‌కు మరమ్మతులు



చటాన్‌పల్లి రైల్వే గేట్

షాద్‌నగర్, జూలై 5 : రైలు పట్టాల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం చటాన్‌పల్లి రైల్వే గేట్‌ను తాత్కాలికంగా మూసి వేసినట్లు షాద్‌నగర్ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే గేట్ మీదుగా దూసకల్, బుచ్చిగూడ, పౌల్ట్రీ ఫామ్స్‌కు వెళ్లే వాహనదారులు ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని అధికారులు సూచించారు.

నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

గిరిజన సంక్షేమ కార్యదర్శి డాక్టర్ శరత్



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ కార్యదర్శి డాక్టర్.ఏ.శరత్

వికారాబాద్, జూలై 5: గురుకుల ఆశ్రమ, గిరిజన హాస్టళ్లలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, మంచి భోజనం అందించాలని గిరిజన సంక్షేమ కార్యదర్శి డాక్టర్ ఏ.శరత్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గురుకుల, గిరిజన హాస్టల్ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలు ఎవరైతే పరీక్షలు రాసి లిస్ట్‌లో పేర్లు ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి అడ్మిషన్లు ఇవ్వాలని అన్నారు. పాత టెండర్లను పిలిచి ఈ నెలఖారు వరకు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో క్లస్టర్ వారీగా వంట వారిని గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, లేదంటే వారి ఆరోగ్యం పాడవుతుందన్నారు. పిల్లల ఆరోగ్యంపై దృష్టిసారించాలని సూచించారు. హాస్టళ్లలో కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. సన్న బియ్యం సరఫరా అయ్యేలా సివిల్ సప్లయ్ అధికారులు చూడాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన సమయ పాలన పాటించాలన్నారు. జిల్లాలో హాస్టళ్ల, కేజీబీవీల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు తన దృష్టికి రాకూడదన్నారు. హాస్టల్ నిర్వహణ పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. హాస్టళ్లలో ఎక్కడైనా చిన్న చిన్న మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు డ్రెస్‌లు కుట్టించి అనుకున్న సమయం లోపల పంపిణీ చేయాలని ఆదేశించారు. బదిలీల జీవో వచ్చినందున జిల్లా స్థాయిలో అధికారులంతా సమావేశం ఏర్పాటు చేసుకొని ఆప్షన్ తీసుకొని పోస్టింగ్ ప్రిపేర్ చేయాలన్నారు. ప్రతీ హాస్టల్, గురుకులాల్లో ఒక ఏఎన్ఎం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌సీవో స్కూల్స్ వారిగా రిజిస్టర్ పెట్టి అనారోగ్యానికి గురైన పిల్లల పేర్లు నమోదు చేయాలన్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన సౌకర్యాలని కల్పిస్తామన్నారు. తద్వారా వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తాగునీటిపైన ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పారు. హాస్టళ్ల, కేజీబీవీ పాఠశాలలకు నాణ్యమైన బియ్యం వచ్చేలా చూస్తామని, తాగునీరు, శానిటేషన్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు. అన్ని విషయాలపై దృష్టిసారించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ చందన, ఎస్సీ వెల్ఫేర్ హేమలత, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి మల్లేశం, గిరిజన సంక్షేమ హాస్టల్ వార్డెన్లు, గురుకుల ప్రిన్సిపాల్‌లు, ఆర్‌సీవో సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంచంపట్టిన విద్యార్థులు

» గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్

» 14 మందికి విద్యార్థులకు వాంతులు, విరోచనాలు

» వసతి గృహంలోని పరిసరాలు, మరుగుదొడ్లు అధ్వానం



చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న స్పీకర్

వికారాబాద్, జూలై 5: గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 14 మంది ఆసుపత్రి పాలుకాగా మరి కొంత మంది హాస్టల్‌లో మంచాన పడ్డ సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వికారాబాద్ అనంతగిరి పల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా విద్యార్థులు వాంతులు, విరోచనాలతో బాధ పడుతున్నారు. శుక్రవారం 14 మంది విద్యార్థులకు వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. అదే సమయంలో పాఠశాలలో విద్యార్థులు చాలా వరకు మందులు వేసుకుని మంచంపై పండుకున్నారు. హాస్టల్ ఆహారం కలుషితం కావడం, పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థులు అస్వస్థకు గురైనట్లుగా తెలుస్తోంది. పాఠశాలలో మరుగుదొడ్లు పూర్తిగా అధ్వానంగా ఉండడం, వాటికి కనీసం డోర్లు కూడా లేక పోవడంతో కంపు కొడుతున్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు. పరిసరాలు చెత్తాచెదారంతో అధ్వానంగా మారాయి. అధికారులు పాఠశాలను సందర్శిస్తే అసలు విషయాలు బయట పడుతాయని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

తల్లిదండ్రులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు: స్పీకర్

తల్లిదండ్రులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, అస్వస్థతకు గురైన విద్యార్థులు కోలుకుంటున్నారని, రేపటి వరకు విద్యార్థులు అందరూ బాగుపడతారని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా అనంతగిరి పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలియడంతో కలెక్టర్ ప్రతీక్ జైన్ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆ తర్వాత అనంతగిరి పల్లి పాఠశాలకు వెళ్లిఅక్కడ పరిసరాలను పరిశీలించారు. కిచన్ హాల్, మరుగుదొడ్లు అన్ని పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. 2012లో నేను తీసుకొచ్చిన పాఠశాల అని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ పాఠశాలను ఎవరూ పట్టించుకోలేదన్నారు. పాఠశాలలో కొన్ని మరమ్మతులు చేయాల్సి ఉందని, మరుగుదొడ్లు బాగు చేయాల్సి ఉందన్నారు. అవసరమైతే ప్రభుత్వ నిధులు లేక పోతే మా నిధులు లేదా కలెక్టర్ నిధుల ద్వారా వీటిని బాగు చేయడం జరుగుతుందన్నారు. నలుగురు విద్యార్థులు ఒక మంచం మీద పంటున్నారని ఇద్దరు విద్యార్థులు ఒక మంచం మీద పండే విధంగా కొత్త మంచాలు తెస్తామని, వార్డెన్ లేదని, ప్రిన్సిపాల్ ఉండడంతో కొంత ఇబ్బందిగా ఉందన్నారు. స్పీకర్ వెంట సంబంధిత శాఖల అధికారులు, డీఎంహెచ్‌ఓ పాల్వాన్‌కుమార్, మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, నాయకులు సుధాకర్ రెడ్డి, రమేష్, కిషన్ నాయక్, రాంచందర్ రెడ్డి, మురళి, ఆసిఫ్, వేణుగోపాల్ రెడ్డి ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న స్పీకర్, కలెక్టర్

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన స్పీకర్

విద్యార్థులతో మాట్లాడిన అనంతరం స్పీకర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు అధికారులు ప్రజా ప్రతినిధులు విద్యార్థులతో భోజనం చేశారు. వారితో కలిసి కూర్చొని భోజనం చేశారు.

పాఠశాలను సందర్శించిన డీఎంహెచ్‌వో

విద్యార్థుల అస్వస్థత విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వాన్ కుమార్ పాఠశాలకు వెళ్లి విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోవర్దన్ మృతి పట్ల సీఎం సంతాపం

» కోస్గికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్, జూలై 5: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ చింతల గోవర్దన్ రెడ్డి గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో కోస్గి మండలంలోని పోతిరెడ్డిపల్లికి చేరుకొని ఆయన మృతికి సంతాపం తెలిపి కుటుంబసభ్యులను పరామర్శించారు. గోవర్దన్‌రెడ్డి టీడీపీలో సీనియర్ నాయకుడిగా సేవలందించిన ప్పటి నుంచి రేవంత్ రెడ్డితో సన్నిహితంగా ఉంటూ వచ్చారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి, సోదరుడు, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి గోవర్దన్‌రెడ్డి మృతి పట్ల సంతాపం తెలిపారు. గోవర్దన్‌రెడ్డి కుటుంబానికి పార్టీపరంగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న పామెన భార్గవరామ్

కార్యకర్తలను విస్మరిస్తే ఊరుకోం

షాబాద్, జూలై 5 : ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీ కార్యకర్తలను విస్మరిస్తే ఊరుకునేదిలేదని డీసీసీ ప్రధానకార్యదర్శి పామెన భార్గవరామ్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్య, యూత్ కాంగ్రెస్ డివిజన్ ఇన్‌చార్జి పెంటారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగలి చెన్నయ్య, పామెన నర్సింహులు, పార్టీ సీనియర్ నాయకులు తమ్మలి రవీందర్, అక్బర్‌పాష తదితరులతో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీని నిలబెట్టి, జెండాలను భుజాలపై మోసి పార్టీని నిలబెట్టిన కార్యకర్తలు, నాయకుల పట్ల బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే యాదయ్య ఒంటెద్దు పోకడలు పోతే ఊరుకునేదిలేదన్నారు. ఇటీవల మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుని ఇంట్లో విందు చేయడం దేనికి సంకేతమన్నారు. హైకమాండ్ తీసుకున్న నిర్ణయాలకు మేము కట్టుబడి ఉన్నాం కానీ, పార్టీ కోసం కష్టపడ్డవాళ్లను పక్కన పెడితే చూస్తూ ఊరుకునేదిలేదన్నారు. ఎలాంటి అభివృద్ధి పథకాలు అమలైన నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ నాయకులను కలుపుకొని ముందుకు పోవాలన్నారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మల్లేష్, మండల ప్రధానకార్యదర్శి శ్రీరాంరెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, నాయకులు తదితరులున్నారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో అండేకార్ యాదిలాల్

కిషన్‌రెడ్డిని కలిసిన యాదిలాల్

ఆమనగల్లు, జూలై 5: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డిని శుక్రవారం ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అండేకార్ యాదిలాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలో ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు యాదిలాల్ పేర్కొన్నారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలో ఆరెకటికలను ఎస్సీ జాబితాలో చేర్చేలా చొరవ తీసుకోవాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఆయనతో రాంకిరణ్, తదితరులు ఉన్నారు.

మట్టి ఎడ్ల సంబురాలు



కొడంగల్ రూరల్, జూలై 5: మట్టి ఎడ్ల అమావాస్యను పురస్కరించుకొని కొడంగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు మంగళవారం మట్టితో ఎడ్ల ప్రతిమలను తయారు చేసి వాటికి పూజలు చేశారు. అమావాస్య రోజు పండగ జరుపుకుంటే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, నష్టాలు లేకుండా ధాన్యలక్ష్మి ఇంటికి చేరుతుందని రైతులు విశ్వసిస్తారు.



అంగడిరైచూర్‌లో మట్టితో ఎడ్ల ప్రతిమలను తయారు చేస్తున్న రైతు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, చిత్రంలో చైర్మన్ కొండల్‌రెడ్డి తదితరులు

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

» మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్, జూలై 5: మున్సిపాలిటీల్లో సమస్యలను పరిష్కారించేందుకు పాలకవర్గాలు కృషిచేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. ఆయన శుక్రవారం నిర్వహించిన పోచారం మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారిపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని అన్నారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో రోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, తాగునీటి సమస్యలు ప్రధానంగా ఉంటాయన్నారు. ఉన్న వనరులతోనే ప్రధాన సమస్యలపై దృష్టిసారించాలన్నారు. వార్డులవారీగా నిధులు కేటాయిస్తే సరిపోక సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయే అవకాశమున్నందున ఒక్కొక్కటిగా పరిష్కరించాలన్నారు. అనంతరం ఎంపీకి పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తా వద్ద భూగర్భ వంతెన నిర్మాణానికి, మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రూ.1.93కోట్లతో చేపట్టనున్న పనులకు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు మహేష్, ధనలక్ష్మి, రాజశేఖర్, సాయిరెడ్డి, శైలజ, బాల్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, లక్ష్మి, హరిప్రసాదరావు, సామల శ్రీలత, సరిత, పోచమ్మ, సుధాలక్ష్మి, బద్దం మమత, కోఆప్షన్‌సభ్యులు అక్రంఅలీ, శకుంతల, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సాయిపూర్ బాల్‌రెడ్డి

» ఉత్తర్వులు జారీ చేసిన మార్కెటింగ్ శాఖ

» రెండేళ్ల పాటు పాలకమండలి గడువు



బాల్‌రెడ్డి

తాండూరు, జూలై 5: జిల్లాలోనే పెద్దదైన తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రకటిస్తూ శుక్రవారం సాయంత్రం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ జీవోను జారీచేసింది. తాండూరు పట్టణం సాయిపూర్‌కు చెందిన వట్లోళ్ల బాల్‌రెడ్డిని చైర్మన్‌గా, వైస్‌చైర్మన్‌గా మదికొండ నర్సిరెడ్డిని నియమించారు. సభ్యులుగా ఎండీ అజ్మత్ అలీ, కె.జర్నప్ప, రాథోడ్ తులసీరాం, మహమ్మద్ ఖరీం, కోటం ఉదయ్ భాస్కర్‌రెడ్డి, ఈడ్గి నర్సింహాగౌడ్, ఉప్పరి మొగులయ్య, బిస్మిల్లా, బి.గొనెగారి శ్రీనివాస్, మేకల రాజు, సీహెచ్ బోజిరెడ్డి, ఎం.మాణిక్యం, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళను ప్రకటిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సిఫారసు మేరకు ఈ పాలకవర్గం గడువు రెండేళ్లు ఉంటుందని అధికారుల ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాధవరెడ్డి



జి.మాధవరెడ్డి



చందర్

బషీరాబాద్: బషీరాబాద్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జి.మాధవరెడ్డి(జీవన్గి) నియమితులయ్యారు. ఈమేరకు ఏపీసీ, మార్కెటింగ్ కమిటీ శాఖ కార్యదర్శి రాఘునందన్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. వైస్‌చైర్మన్‌గా మూడవత్ చందర్, డైరెక్టర్లుగా ఎన్.నరేష్, షేక్ మునీర్ అహ్మద్, నదీర్గా మోహన్, నరేష్‌రథోడ్, సోంపల్లి వనమాల, కె.మహేందర్‌రెడ్డి, వడ్డేహన్మంతు, పీకే.పెంటప్ప, అగనూర్ సతీష్, కోవ్వూరి నరేష్, ఈ.పాండురంగ, అనూప్‌ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, బషీరాబాద్ పంచాయతీ ప్రత్యేకాధికారి రమేష్ పేర్లను ప్రకటించారు.

జనగాం గ్రామాన్ని సందర్శించిన ఎన్ఏఏఏ బృందం

» పంచాయతీల ఆడిట్ నిర్వహణపై పరిశీలన

పెద్దేముల్, జూలై 5: మండలంలోని జనగాం గ్రామాన్ని సిమ్లాకు చెందిన నేషనల్ అకాడమి ఆఫ్ ఆడిట్ అండ్ అకౌంట్స్ (ఎన్ఏఏఏ)డైరెక్టర్ డాక్టర్ నంద దులాల్‌తో పాటు ఇద్దరు ఏజీడీ ట్రైనర్స్ డిప్యూటీ అకౌంట్ జనరల్ డాక్టర్ కామినేని సంజయ్‌రావుతో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీల రికార్డులు, ఆడిట్ నిర్వహణ, పరిపాల విధానంపై ఆరాతీశారు. ఏప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నారో తెలుసుకున్నారు. టెండర్లు వేస్తారా లేక నేరుగా పనులు చేస్తారా? అని అడిగి తెలుసుకున్నారు. వారికి డీఎల్పీవో శంకర్‌నాయక్ అన్ని విషయాలను వివరించారు. పంచాయత్‌రాజ్ వ్యవస్థ, గ్రామీణప్రాంతాల్లో అమలవుతున్న ప్రభుత్వ విధానాలు, ప్రభుత్వ పథకాల గురించి వారికి తెలిపారు. గ్రామంలో తాగునీటి వ్యవస్థ, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అనంతరం పల్లె ప్రకృతివనం, నర్సరీ, కంపోస్ట్ షెడ్లు, వంటి వాటిని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు విద్యాబోధన ఏవిధంగా జరుగుతుందో పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆడిట్ ఆఫీసర్స్ శేఖర్, గౌతమ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీఈవో రమేష్, పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున్, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



జనగాం గ్రామంలో పర్యటించిన ఎన్ఏఏఏ బృందం

నందిగామ మండల ప్రత్యేక అధికారిగా నీరజ బాధ్యతల స్వీకరణ



నీరజను సన్మానిస్తున్న ఎంపీడీవో సిబ్బంది

నందిగామ, జూలై 5: నందిగామ మండల ప్రత్యేక అధికారిగా నీరజ పదవీ బాధ్యతలు తీసుకుంది. ఆమె రంగారెడ్డి జిల్లా ఉద్యానశాఖ అధికారిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా నందిగామ మండలానికి ఆమెను స్పెషలాఫీసర్‌గా నియమించారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది స్వాగతించి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుమతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ హమీద్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల మండల ఇన్‌చార్జి ఏపీఎంగా సుదర్శన్‌రెడ్డి



మాడ్గుల, జూలై 5 : యాచారం మండల ఏపీఎంగా పనిచేస్తున్న సుదర్శన్‌రెడ్డిని మాడ్గుల మండల ఏపీఎంగా ప్రభుత్వం నియమించింది. ఈమేరకు శుక్రవారం మాడ్గుల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఏపీఎం సుదర్శన్‌రెడ్డి మహిళసమాఖ్య కార్యాలయంలో జరుగుతున్న పనితీరును అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రుణాలను సకాలంలో వసూలు చేయాలని ఆయన సూచించారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సైదమ్మ, ప్రధాన కార్యదర్శి పోచమ్మ, కోశాధికారి మమత, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, జూలై 5: ప్రజలకు సేవలు అందించడానికి పదవులు శాశ్వతం కాదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేయడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గురువారంతో ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో శుక్రవారం బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీలను నగరంలోని ఆమె నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి ఐదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంపీటీసీలుగా, సర్పంచ్‌లుగా, జడ్పీటీసీలుగా పనిచేసిన ప్రజాప్రతినిధులను అభినందించారు. ఉమ్మడి రాష్ట్రంలో గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు పాలకులు అనేక ఇబ్బందులకు గురయ్యేవారమని, ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అలాంటి ఇబ్బందులు కలుగకుండా కేసీఆర్ పెద్దపీట వేసినట్లు గుర్తుచేశారు. పదేళ్ల కాలంలో మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తాజా మాజీ ఎంపీటీసీలు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, తాండ్ర ఇందిరదేవేందర్, కాకి రాములు, సురేష్, లలితకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: మాజీ ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



కొందుర్గు : మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్

అభివృద్ధితోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు

కొందుర్గు : ప్రజాప్రతినిధులు తమ పదవీ కాలంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధితోనే వారికి గుర్తింపు వస్తుందని వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పదవీ కాలం పూర్తిచేసుకున్న ఎంపీటీసీ సభ్యులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాజేష్ పటేల్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు చేసే సేవలకు పదవీ విరమణ ఉండదని, ప్రస్తుతం సేవాకాలం పూర్తి చేసుకున్న ప్రజా ప్రతినిధులు భవిష్యత్తులో నిర్వహించే ఎన్నికల్లో గెలిచి, తిరిగి ప్రజా సేవ చేసేందుకు ప్రజా ప్రతినిధులుగా రావాల్సిన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండవ అతిపెద్ద మండలంగా ఉన్న కొందుర్గు మండలం నుంచి జిల్లేడ్-చౌదరిగూడ మండలం కొత్త మండలం కావడంతో, మండలం చిన్న మండలముగా మారిందన్నారు. ఐదేళ్ల పదవీ కాలంలో మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు తామంతా కృషి చేసినట్లు తెలిపారు. తమకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు, అధికారులకు, ప్రస్తుత ఎమ్మెల్యేకు ఎంపీటీసీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న ఎంపీటీసీలను పూలమాలలు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగయ్య, జడ్పీటీసీ రాగమ్మ, ఇటీవల పదవీ విరమణ పొందిన ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీవో లాలయ్య, ఎంపీటీసీలు మంజుల, దేవమ్మ, రాజు, ఇస్తారమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

కడ్తాల్ : ప్రజా సేవ చేసేందుకు యువత రాజకీయాల్లోకి రావాలని కడ్తాల మాజీ జడ్పీటీసీ, జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో ఐదేళ్ల పదవీ కాలం పూర్తిచేసుకున్న దశరథ్ నాయక్‌కు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో ఆయనను సత్కరించి అభినందించారు. దశరథ్ నాయక్ మాట్లాడుతూ పదవులు శాశ్వత కాదని, చేసిన పనులు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. చదువుకున్న యువత సేవాభావంతో రాజకీయాల్లోకి వస్తే ప్రజలకు మేలు జరుగడంతో పాటు ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కడ్తాల మండలాభివృద్ధికి ఐదేళ్ల పదవీకాలంలో ఎంతగానో కృషి చేశానని, మిగిలిపోయిన పనుల పూర్తికి ప్రభుత్వం ఒత్తిడి తెస్తానని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, మాజీ ఎంపీపీ సువాళి వంతు, మాజీ ఎంపీటీసీ ప్రియ రమేశ్, నాయకులు శంకర్, కొప్పు కృష్ణ, మహేశ్, అంజి, పాండు, రాజు, హరి, గోపాల్, వెంకటేశ్, శ్రీను, శ్రీకాంత్, ఉపేందర్, రమేశ్, జాన్స్, దేవా, రాజశేఖర్, సాయి, మహేశ్, కరుణాకర్, కిరణ్, మురళి, తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్ : దశరథ్ నాయక్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ యూత్ వింగ్ నాయకులు

క్రైం కార్నర్

చెల్లెళ్లకు భూమి రిజిస్ట్రేషన్ చేశాడని.. తండ్రిపై కుమారుల దాడి

● కుమార్తెల ఫిర్యాదు.. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

కడ్తాల్, జూలై 5 : తమ భూమిని ఇద్దరు చెల్లెళ్ల పేరిట రిజిస్ట్రేషన్ చేశాడనే నెపంతో తండ్రిపై కుమారులు దాడిచేసిన ఘటన మండల పరిధిలోని రావిచెడ్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రావిచెడ్‌కు చెందిన మెండె వెంకటయ్యకు 4 ఎకరాల పట్టా భూమి ఉంది. కుమారులు నర్సింహ, రమేష్‌లకు ఎకరంన్నర చొప్పున రిజిస్ట్రేషన్ చేశాడు. మిగిలిన ఎకరం భూమిని వెంకటయ్య ఇద్దరు కుమార్తెలు మంగమ్మ, సునీతలకు 20 గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే, ఆ భూమి కూడా తమకు రాసివ్వాలని తండ్రిపై కుమారులు కక్ష పెంచుకున్నారు. ఈక్రమంలో శుక్రవారం వెంకటయ్యను కుమారులిద్దరూ కలిసి చేతులు, కాళ్లపై తీవ్రంగా కొట్టి గాయపరిచారు. విషయం తెలుసుకున్న కుమార్తెలు సునీత, మంగమ్మలు వెంకటయ్యను ఆస్పత్రికి తరలించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని రమేష్, నర్సింహలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

పనికి వెళ్లమని మందలించిన తల్లి.. మనస్తాపంతో రైలుకింద పడి కుమారుడి ఆత్మహత్య

షాద్‌నగర్ రూరల్ జూలై 5 : ఇంట్లో ఖాళీగా ఉండకుండా పనికి వెళ్లమని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన షాద్‌నగర్ రైల్వేస్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ కథనం ప్రకారం.. చటాన్‌పల్లిలోని రాంనగర్ కాలనీకి చెందిన కేతావత్ గోపాల్(25)ను ఇంట్లో ఖాళీగా ఉండకుండా పనికి వెళ్లాలని అతడి తల్లి మందలించింది. దాంతో మనస్తాపానికి గురైన గోపాల్ హైదారాబాద్ వైపు కీర్తి వెంచర్ సమీపంలో గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు గోపాల్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కొత్తూర్‌లో ఉరేసుకుని వివాహిత..

కొత్తూర్: జూలై 5: మండల కేంద్రంలోని కుమ్మరిగూడ రహదారిలో నివాసం ఉంటున్న ప్రియాంక(26) అనే వివాహిత శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై జి.శ్రీనివాస్ తెలిపారు. జార్ఖండ్‌కు చెందిన ఉమాశంకర్ ఉపాధి కోసం కొత్తూర్‌కు వలసి వచ్చి ఓ పరిశ్రమలో పనిచేస్తూ కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉమాశంకర్ ఉదయం విధులకు వెళ్లగా.. ఇద్దరు కుమారులు పాఠశాలకు వెళ్లారు. విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకున్న ఉమాశంకర్ ఇంటి తలుపులు పెట్టి ఉండడం గమనించాడు. దాంతో కుమారుడిని కిటికీ నుంచి లోపలికి పంపించి తలుపులు తెరిపించేందుకు యత్నించాడు. అనంతరం లోపలికి వెళ్లిచూడగా బెడ్‌రూంలో ప్రియాంక ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించడంతో కిందకు దింపి పరిశీలించాడు. అప్పటికే ఆమె మృతిచెందింది. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని, ప్రియాంక కుటుంబసభ్యులు వచ్చిన తర్వాత కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

హత్యకేసులో ముగ్గురు నిందితుల రిమాండ్

కందుకూరు, జూలై 5: మండలంలోని కొత్తగూడ గ్రామంలో గురువారం జరిగిన వ్యక్తి హత్యకేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టుచేసి శుక్రవారం సాయంత్రం రిమాండ్‌కు పంపినట్లు సీఐ సీతారామ్ తెలిపారు. శుక్రవారం ఎస్సైలు శ్రవణ్‌కుమార్, సైదులుతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. గురువారం తెల్లవారుజామున కొత్తగూడ గ్రామంలో కుంచకట్ల పరమేష్(37)ను అతడి భార్య స్వప్న, అత్త సుక్కమ్మతో పాటు వారి బంధువు కొత్తగూడ గ్రామానికి చెందిన బండారి లలితలు కలిసి హత్యచేశారు. ఈమేరకు వారిని అదుపులోకి తీసుకొని విచారించామని, నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సీతారామ్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

యాచారం, జూలై 5 : అక్రమంగా తరలిస్తున్న 3 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రాచకొండ ఎస్వోటీ మొండిగౌరెల్లి గ్రామంలో శుక్రవారం పట్టుకొని యాచారం పోలీసులకు అప్పగించారు. కడ్తాల్ మండలంలోని సరికొండకు చెందిన అలంపల్లి శ్రీనివాస్ తన ఆటోలో మొండిగౌరెల్లిలో రేషన్ బియ్యాన్ని జనం వద్ద కొనుగోలు చేశాడు. ఈమేరకు కడ్తాలకు తరలిస్తుండగా.. ఎస్వోటీ పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎక్సైజ్ దాడులు.. ఇద్దరు అరెస్ట్

ఆమనగల్లు, జూలై 5: ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల, ఆమగల్లు మండలాల పరిధిలో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించినట్లు సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా చారగొండ-ఇర్విన్ రూట్‌లో బైక్‌లపై తరలిస్తున్న 12 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రెండు బైక్‌లను సీజ్‌చేసి నంద్రలగడ్డ తండాకు చెందిన దేవుల, అప్పారెడ్డిపల్లికి చెందిన రాములును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అలాగే సారా కేసుల్లో పట్టుబడిన ఏడుగురిని మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో ఎస్ఐలు అరుణ్‌కుమార్, కృష్ణప్రసాద్, స్వప్న, సిబ్బంది, శంకర్, దశరథ్, సురేశ్, బాబు, బాలస్వామి, లోక్య, నర్సింహ, తదితరులు ఉన్నారు.

కుటుంబ కలహాలు.. వ్యక్తి అదృశ్యం



నర్సింహ

శంషాబాద్ రూరల్, జూలై 5 : కుటుంబ కలహాల వల్ల ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన శుక్రవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని తొండుపల్లికి చెందిన నర్సింహ ఈనెల 4న కుటుంబ సభ్యులతో గొడవపడ్డారు. ఆతర్వాత అతడు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో అతడి కుమారుడు శుక్రవారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిసినవారు సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలి

● బీఆర్ఎస్, బీజేవైఎం నాయకులు



యాచారం : పోలీసుల అదుపులో బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు



కందుకూరు : పోలీసుల అదుపులో బీఆర్ఎస్ యువజన విభాగం, సేవాలాల్ సేనా నాయకులు

యాచారం, జూలై 5 : జాబ్ క్యాలెండర్ విడుదల చేసి గ్రూప్-1, 2 పోస్టులు పెంచడంతో పాటు డీఎస్సీ నిర్వహించాలని తదితర డిమాండ్లతో కలెక్టరేట్ ముట్టడికి బీజేవైఎం పిలుపు మేరకు శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకే తరలి వెళుతున్న యాచారం, నల్లవెల్లి, మేడిపల్లి, నందివనపర్తి తదితర గ్రామాలకు చెందిన బీజేవైఎం కార్యకర్తలను యాచారం, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. కార్యకర్తలు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వానికి.. ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం తేడాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తాము పలు ప్రజాసమస్యల పరిష్కారం కోసం ధర్నా, ఆందోళనలకు పూనుకుంటే పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఇబ్బందుల పాలు చేశారని బీజేపీ మండలాధ్యక్షుడు తాండ్ర రవీందర్ విమర్శించారు. అ రెస్టయిన వారిలో శేఖర్, ముంత జంగయ్యయాదవ్, జి.రమేష్, తదితరులున్నారు.

కందుకూరు : నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేయాలని, సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఉద్యమాలను పోలీసులచే అణచాలని చూస్తే భయపడేది లేదని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం యువజన విభాగం సీనియర్ నాయకులు తాళ్ల కార్తీక్, సేవాలాల్ సేనా రాష్ట్ర కో-కన్వీనర్ రఘురాం రాథోడ్‌లు అన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్, బీజేపీ, సేవాలాల్ సేనా సంఘాలు తలపెట్టిన నిరసన కార్యక్రమానికి కలెక్టరేట్‌కు వెళ్లకుండా వారిని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు దీక్షిత్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను సస్పెండ్ చేయాలి

షాబాద్, జూలై 5 : అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, మండలాధ్యక్షుడు దాదె మహేష్‌లు అన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన డీఈవోను సస్పెండ్ చేయాలని శుక్రవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునివ్వడంతో వారిని ముందస్తుగా అరెస్టు చేశారు. వారు మాట్లాడుతూ.. గ్రూప్1 పోస్టులకు 1100 నిష్పత్తిలో పిలువాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. గ్రూప్2 పోస్టులను పెంచి, డిసెంబర్‌లో పరీక్షలు పెట్టాలన్నారు.

ఇబ్రహీంపట్నం : రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు టీఎస్‌పీఎస్సీ ముట్టడి కార్యక్రమానికి మద్దతు పలికిన బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు జెర్కోని రాజు, శివ సాయి తదితరులను శుక్రవారం ఉదయం ఇబ్రహీంపట్నం పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. పోలీసుల వైఖరిని ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ ఇబ్రహీంపట్నం మండలాధ్యక్షుడు బుగ్గ రాములు, మాజీ ఎంపీటీసీ ఏనుగు భరత్‌రెడ్డిలు తెలిపారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి



నర్సరీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్

ఆమనగల్లు, జూలై 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ప్రతీఒక్కరు సామాజిక బాధ్యతగా భావించి ఉద్యమస్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో 10 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. వనమహోత్సవ కార్యక్రమం విజయవంతాన్ని ప్రతి ఒక్కరు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్ల వెంబడి, ఖాళీ ప్రదేశాలలో పండ్ల, పూల, నీడనిచ్చే మొక్కలు నాటేందుకు స్థలాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, నాయకులు తదితరులు ఉన్నారు.

2.20లక్షల మొక్కల పెంపకం

మొక్కల పెంపకంపైనే భావితరాల మనుగడ ఆధారపడి ఉందని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యలు అన్నారు. వనమహోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో 2.20 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని నర్సరీని వారు సందర్శించారు. నర్సరీలో మొక్కలను పరిశీలించి నాటేందుకు సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చెక్కాల లక్ష్మణ్, విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, విక్రమ్‌రెడ్డి, కృష్ణయాదవ్, దివ్యశ్రీకాంత్‌సింగ్, యాదమ్మశ్రీశైలం యాదవ్, గోరటి జ్యోతినర్సింహ్మ, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల బహిరంగ వేలం వాయిదా

● మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న

షాద్‌నగర్, జూలై 5 : చికెన్ వ్యర్థాల బహిరంగ వేలం పాటను రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న వెల్లడించారు. గత నెల 29న షాద్‌నగర్ పట్టణంలోని చికెన్ వ్యర్థ పదార్థాల సేకరణకు సంబంధించి టెండర్‌లను ఆహ్వానించామన్నారు. దీనిపై స్థానికంగా చికెన్ విక్రయదారులతో పాటు, ఆరె కటిక సంఘం, ఇతర ప్రజా ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. శుక్రవారం జరగాల్సిన వేలంను వారం తర్వాత నిర్వహిస్తామన్నారు.

స్థానికులకే అవకాశం కల్పించాలి

చికెన్ వ్యర్థ పదార్థాల సేకరించేందుకు స్థానికులకే అవకాశం కల్పించాలని చికెన్ విక్రయదారులు, ఆరె కటిక సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. వేలం పాటలోనూ షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలో ఉన్న చికెన్ విక్రయదారులు మాత్రమే వేలం పాటలో పాల్గొనేలా టెండర్‌లో నమోదు చేయాలని కమిషనర్‌ను కోరారు. గతంలో చికెన్ వ్యర్థాల సేకరణకు సంబంధించి టెండర్‌లను ఆహ్వానించిన విషయం తమకు తెలియదన్నారు. వ్యర్థ పదార్థాల వల్ల లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతుందన్న విషయం కూడా తమ దృష్టికి రాలేదన్నారు. దశాబ్ద కాలం పాటు గుట్టుచప్పుడు కాకుండా టెండర్‌లను ఆహ్వానించి నాన్ లోకల్ వ్యక్తులకు అప్పచెప్పినందున, ఈ సారి తమకే అవకాశం కల్పించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నందిగామ, జూలై 5: మండల పరిధిలోని నర్సప్పగూడలో జడ్పీ, ఎస్‌డీఎఫ్ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం మాజీ ఎంపీటీసీ ఎంకిర్యాల కళమ్మ స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరిగౌడ్, నర్సింలుగౌడ్, మల్లేష్, యాదయ్య లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ‘రేబీస్ టీకాలు’

కడ్తాల్, జూలై 5: కడ్తాల పశువైద్య కేంద్రంలోని పశువైద్యశాలలో నేడు(శనివారం) కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలను వేస్తున్నట్లు మండల పశువైద్య అధికారి భానునాయక్ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం భాను నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు.

నలుగురు ఎస్సైల బదిలీ


ఆదిభట్ల/యాచారం, జూలై 5 : ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, యాచారం పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తు రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిభట్ల ఎస్సైగా పనిచేస్తున్న వై.లింగారెడ్డి, ఇబ్రహీంపట్నం పీఎస్‌లో పనిచేస్తున్న ఎస్సై మారయ్యలను సరూర్ నగర్ పీఎస్‌కు, ఇబ్రహీంపట్నం పీఎస్‌లో పనిచేస్తున్న ఎస్సై ఎస్కే షైబెల్లీని నాచారం పీఎస్‌కు బదిలీ చేశారు. ఇబ్రహీంపట్నంలో పనిచేస్తున్న మరో ఎస్సై పిక్కస్వారెడ్డిని బదిలీ చేసినప్పటికీ ఈ సంవత్సరం అక్టోబర్‌లో పదవీ విరమణ ఉన్నందున తన బదిలీ నిలిపివేశారు. యాచారం ఎస్సై వెంకటనారాయణను కీసర పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయగా కీసరలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై మధును యాచారం స్టేషన్‌కు బదిలీ చేశారు.

దక్షిణ భారత కటిక సంఘం అధ్యక్షుడిగా డబ్బికార్ శ్రీనివాస్



ఇబ్రహీంపట్నం, జూలై 5 : దక్షిణ భారత కటిక సంఘం అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నంనకు చెందిన డబ్బికార్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు,కేరళ, పాండిచేరి రాష్ట్రాలకు చెందిన కటిక సమాజ్ ప్రతినిధులు శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈమేరకు శ్రీనివాస్‌ను జాతీయ కటిక ఫెడరేషన్ అధ్యక్షులు నేతిరామ్ టగేలా, కార్యదర్శి మండికారి బాలాజీ, తెలంగాణ కటిక ట్రస్ట్ అధ్యక్షులు నర్సింగ్ రావు, ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ మక్కేడి భాగ్యలక్ష్మీ, ఏక్ సమాచార్ పత్రిక ఎడిటర్ గంగాధర్ వివిధ రాష్ట్రాలకు చెందిన కటిక సమాజ్ ప్రతినిధులు డబ్బికార్ శ్రీనివాస్‌ను అభినందించారు.

రావిచెడ్ అభివృద్ధికి ఎంతో కృషి



మాట్లాడుతున్న బొప్పిడి గోపాల్

కడ్తాల్, జూలై 5: ఎంపీటీసీ పదవిని బాధ్యతగా భావించి రావిచెడ్ గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశానని మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్ అన్నారు. ఐదేళ్ల తమ పదవి కాలంలో రావిచెడ్, న్యామతాపూర్, నాగిరెడ్డిమద్దెల కుంట తండాలలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించి చాలా వరకు ఇబ్బందులు తీర్చామన్నారు. రావిచెడ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గోపాల్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. సుమారు రూ. 5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

నాటకోత్సవాలకు ఆహ్వానం

షాద్‌నగర్‌అర్బన్, జూలై 5: షాద్‌నగర్ పట్టణంలో ఈ నెలలో నిర్వహించతలపెట్టిన జాతీయ బాలల బహు భాషా నాటకోత్సవాలు -2024 కార్యక్రమానికి రావాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను ఆహ్వానించినట్లు ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు టీవీ రంగయ్య తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని ఎంపీ ఆఫీసులో శుక్రవారం అరుణను కలిసి ఆహ్వానించామని తెలిపారు. నాయకులు సింగారం శ్రీనివాస్, వడ్ల రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ అరుణకు ఆహ్వాన ప్రతి అందిస్తున్న రంగయ్య

ఎంపీ అరుణకు ఘన సన్మానం

ఎంపీ డీకే అరుణను షాద్‌నగర్ బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని బీజేపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు శుక్రవారం మహబూబ్‌నగర్ బీజేపీ కార్యాలయానికి తరలివెళ్లారు. అరుణను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీకి మంచి రోజులు వచ్చాయని, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతీ ఒక్కరు కలిసి కట్టుగా కృషి చేయాలని అరుణ సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ నాయకులు కెవిఎల్ఎన్ రాజు, దేపల్లి అశోక్‌గౌడ్, అమదాపురం నర్సింహ్మగౌడ్, కమ్మరి భూపాలాచారి, మచ్చ సుధాకర్‌రావు, ఎం. మురళి, హరిభూషన్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆకుల ప్రదీప్, మోహన్ నాయక్, లష్కర్‌నాయక్, బోయ కుర్మయ్య, వెంకటేష్‌యాదవ్,శ్రీశైలం, నాగరాజుచారి, తాండ్ర రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న ఎస్సై, కానిస్టేబుళ్లకు సన్మానం

తలకొండపల్లి/ఆమనగల్లు, జూలై 5 : తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆరేళ్లుగా విధులు నిర్వహించి బదిలీపై వెలుతున్న కానిస్టేబుళ్లు ప్రభాకర్, బాలస్వామిలను శుక్రవారం సాయంత్రం ఎస్సై శ్రీకాంత్ పూలమాలలతో పాటు శాలువలతో సత్కరించారు. జామవాచ హేమంత్, నిరంజన్, సుధాకర్, శ్రీనివాస్ తదితరులున్నారు. అలాగే ఆమనగల్లు ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు ను మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పలువురు నాయకులతో కలిసి ఎస్సై శ్రీనివాసులును సత్కరించి అభినందించారు. కాంగ్రెస్ మండలా ధ్యక్షుడు జగన్, ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, నాయకులు బుచ్చిరెడ్డి, శేఖర్, యాదయ్య, శ్రీశైలం, శ్రీకాంత్,కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

అవేర్ ఆసుపత్రిలో అన్నిరకాల వైద్య సేవలు



సమావేశంలో చైర్మన్ మాధవన్‌జీ

మహేశ్వరం, జూలై 5 : సమాజంలో సత్యం, ధర్మం న్యాయం ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలంతా ప్రతిరోజు ఆరోగ్యంగా ఉంటూ 120 సంవత్సరాలు జీవించాలనే ఉద్దేశంతో మండల పరిధిలోని అవేర్‌లో ఆరోగ్యధామ్ పేరుతో ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నామని అవేర్‌సంస్థ వ్యవస్థాపక చైర్మన్ మాధవన్ జీ అన్నారు. శుక్రవారం అవేర్‌లో ఆయన మాట్లాడుతూ ఈనెల 7నుంచి ఆసుపత్రిలో తక్కువ ధరలకే అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. దశాబ్దాలుగా ఎన్నోరకాలుగా పేదలకు రకరకాల సేవలందిస్తున్న అవేర్ సంస్థ.. ఇప్పుడు ఆరోగ్యకేంద్రం ద్వారా సేవలందిస్తామన్నారు. అంతేకాకుండా అవేర్‌లో త్వరలో మెడికల్ కాలేజీని కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల మాదిరిగా కాకుండా.. 25 శాతం వరకు తక్కువ ధరలు ఉంటాయన్నారు. ఈ సేవలను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ సిహెచ్. కేతన్, అవేర్ సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి నారపంగ వెంకన్నతో పాటు ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : పనితీరు ఆధారంగానే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు, ప్రముఖ సంఘసేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయినీలు సుశీల, అరుణశ్రీ, విద్యావతి, మాలతిలకు పాఠశాల ఆవరణలో శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాము, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాస్‌తో కలిసి వారిని సత్కరించారు.

కేశంపేట : కాకునూర్ చౌరస్తాలో బీటీ రోడ్డు వేయించాలని కాంట్రాక్టర్ గోపాల్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు కోరారు. చౌరస్తాను యెన్నం శ్రీధర్‌రెడ్డి, యుగంధర్, సత్యనారాయణలు కాంట్రాక్టర్‌తో కలిసి నాయకులు పరిశీలించారు. రోడ్డు పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. వారంలో బీటీ నిర్మాణం చేపడతానని కాంట్రాక్టర్ చెప్పారు.

బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరించాలి

● యూనియన్ నాయకుల డిమాండ్

షాద్‌నగర్‌అర్బన్, జూలై 5: ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరించేలా 4జీ, 5జీ సౌకర్యం కల్పించాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.శేఖర్, సంఘం నాయకులు ఎం. వెంకటయ్య, విద్యాసాగర్, కృష్ణయ్యలు శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్‌కు ప్రోత్సాహం లేకపోవడం వల్ల సేవలో వెనుకబడి పోతున్నదని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగ సంస్థలైన రిలయన్స్ జియో, ఎయిల్‌టెల్ కంపెనీలకు 4జీ, 5జీ సేవలకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌కు ఇవ్వకపోవడంతో సంస్థ వినియోగదారులు ఇబ్బంది పడుతూ ప్రైవేట్ వైపు వెళ్తున్నారని తెలిపారు. సేవలను విస్తరిస్తున్న ప్రైవేట్ సంస్థలు తమ టారిఫ్‌ను ఇష్టారాజ్యంగా పెంచుకుంటూ వినియోగదారులపై భారం మోపుతున్నాయని గుర్తుచేశారు. ప్రైవేట్ సంస్థలు ప్రతీయేటా కోట్లలో లాభాలు గడిస్తుంటే, బీఎస్ఎన్ఎల్ సంస్థ మాత్రం తమ మనుగడ కోసం పాకులాడే పరిస్థితిని తీసుకువస్తున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా తక్కువ ధరలకు సేవలను అందిస్తున్న బిఎస్ఎన్ఎల్ సంస్థకు సైతం 4జీ, 5జీ సేవల సౌకర్యాన్ని కల్పిస్తూ, ప్రైవేట్ సంస్థలు పెంచి టారిఫ్ ధరలను తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలి

షాబాద్, జూలై 5 : అంగన్‌వాడీ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్ భారతిరత్నం అన్నారు. శుక్రవారం మండలం కేంద్రంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో షాబాద్, తాళ్లపల్లి క్లస్టర్‌ల అంగన్‌వాడీ టీచర్లకు అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలమేళ, ప్రజల భాగస్వామ్యం గురించి వివరించారు. అదేవిధంగా పూర్వ ప్రాథమిక విద్యా కరదీపిక, ప్రియదర్శిని వంటి కార్యక్రమాలపై మాస్టర్ ట్రైనర్ భారతిరత్నంవివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమాదేవి, శ్రీలక్ష్మి, సృజన, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.